నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, సోమవారం 29 జనవరి 2024 | NAGARKURNOOL

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చిన వేరుశనగ

వేరుశనగ రైతన్నల కన్నీళ్లు

- మార్కెట్‌లో పడిపోయిన ధరలు
- మూడ్రోజుల వ్యవధిలోనే రూ.700 తగ్గుదల
- పెట్టుబడి కూడా రావడంలేదంటూ అన్నదాతల ఆందోళన

కల్వకుర్తి, జనవరి 28 : ఆరుగాలం కష్టించిన వేరుశనగ రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకొని సాగుచేసిన వేరుశనగ ధర రోజురోజుకూ తగ్గుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తాము పండించిన వేరుశనగను మార్కెట్‌కు తీసుకొచ్చి ధర కోసం వ్యాపారుల వంక దీనంగా చూస్తున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే క్వింటాకు రూ.700 వరకు తగ్గుముఖం పట్టింది. రెక్కల కష్టానికి ఫలితం లేకపోయినా.. పెట్టుబడులు ఎలా అంటూ ఆవేదన చెందుతున్నారు.

మార్కెట్‌కు భారీగా వేరుశనగ బస్తాలు

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం 234 మంది రైతులు 9,649 బస్తాల వేరుశనగను తీసుకొచ్చారు. మధ్యాహ్నం వ్యాపారులు రహస్య టెండర్లు వేశారు. మార్కెట్‌కు ఎక్కువ మొత్తంలో వేరుశనగ రావడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తక్కువ వేశారనే ఆరోపణలు రైతుల నుంచి వెల్లువెత్తాయి. గురువారం నాటి ధరలను పోల్చుకుంటే క్వింటాకు రూ.700 తగ్గిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం గరిష్ఠంగా రూ.7,315, కనిష్ఠంగా రూ.4,001, సరాసరి ధర రూ.6,221 పలికింది. నెలరోజులుగా చూస్తే దాదాపు క్వింటాకు రూ.1700 ధర తగ్గింది.

వ్యాపారులు ఆడిందే ఆట.. పాడిందే పాట..

వ్యవసాయ మార్కెట్‌లో రైతుల పక్షాన మాట్లాడే వారే కరువయ్యారు. కేసీఆర్ ప్రభుత్వం నామినేట్ చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ రద్దు కావడంతో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే నాథుడే కరువయ్యాడు. రోజురోజుకూ వేరుశనగ ధరలు తగ్గుతున్నా.. ఎవర్ని ఏమి అడగాలో తెలియని పరిస్థితిలో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రహస్యంగా టెండర్ వేస్తున్నాం.. ఇందులో సిండికేట్ ఏముందంటూ వ్యాపారులు వారి పని వారు చేసుకుంటూపోతున్నారు. తీరా నష్టపోతున్నది రైతు లేనన్నది బహిరంగ సత్యం..

పెట్టుబడే ఎక్కువ.. ధర తక్కువ..

వేరుశనగ సాగుకు పెట్టుబడి చాలా ఎక్కువైందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు కనిష్ఠంగా 10 క్వింటాళ్ల వేరుశనగ దిగుబడి రావాలని రైతులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ఏడు క్వింటాళ్లు కూడా దాటడం లేదని వాపోతున్నారు. వేరుశనగ విత్తనాలు క్వింటా రూ.14వేలకు కొనుగోలు చేశామని, పొలం చదును, ఎరువులు, నూర్పిడి కూలీల ఖర్చు మొత్తం కలిస్తే ఎకరాలకు దాదాపు రూ.50వేల వరకు ఖర్చు వచ్చిందని, ఎకరా వేరుశనగ విక్రయిస్తే రూ.35వేల వరకు మాత్రమే వస్తుందని, చేసిన కష్టం కూడా గంగపాలు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

11న టాలెంట్ టెస్ట్

నారాయణపేట రూరల్, జనవరి 28 : జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి తెలిపారు. టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆదివారం జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా శేర్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ 22ఏండ్ల కిందట డివిజనల్ స్థాయిలో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన టెస్ట్ నేడు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఈ టెస్ట్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహ, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, బస్వరాజ్ ఉన్నారు.

నేడు పరిగికి కేటీఆర్ రాక

మహ్మదాబాద్, జనవరి 28 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సోమవారం పరిగికి రానున్నట్లు బీఆర్ఎస్ ఉమ్మడి మండలాల అధ్యక్షుడు భిక్షపతి, పెంట్యా నాయక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం పరిగి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారని, దీనికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరువుతున్నట్లు పేర్కొన్నారు. గండీడ్, మహ్మదాబాద్ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

ముమ్మరంగా కొనసాగుతున్న30 0ప డకల దవాఖాన, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు

ఆసుపత్రి.. అప్‌గ్రేడ్

- జిల్లా దవాఖాన స్థాయి పెంపు
- వంద పడకల నుంచి 300 పడకలకు అప్‌గ్రేడ్
- మెడికల్, నర్సింగ్ కళాశాలలు కూడా ఏర్పాటు
- కేసీఆర్ సర్కారు ముందు చూపుతో ఆధునిక వైద్యం
- త్వరలో 300 పడకల దవాఖాన, కళాశాల భవనాలు ప్రారంభం
- నడిగడ్డ ప్రజలకు తీరనున్న వైద్య సమస్యలు

గద్వాల, జనవరి 28 : కేసీఆర్ ప్రభుత్వం ఏది అమలు చేసినా అది భవిష్యత్తరాలకు ఉపయోగపడే విధంగా ఉంటుంది. రాష్ట్ర ఏర్పాటుతో ఏమొస్తదన్న ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా అన్ని రంగాలను అభివృద్ధి చేసి సొంత రాష్ట్రంలో అనేక సౌకర్యాలు, వసతులు ఏర్పడతాయని మాటలతో కాకుండా చేతల్లో చేసి చూపించిన వ్యక్తి కేసీఆర్. రాష్ట్ర ఏర్పాటుకు ముందు నడిగడ్డలో వైద్యసేవలు అధ్వానంగా ఉండేవి. దవాఖానలో డాక్టర్లు ఉంటే మందులు ఉండవు.. మందులు ఉంటే డాక్టర్లు, రోగులు ఉండరు. ఏదైనా ప్రమాదం జరిగి దవాఖానకు వస్తే ప్రాథమిక చికిత్స చేసి కర్నూల్ లేదా హైదరాబాద్‌కు తరలించే పరిస్థితి ఉండేది. అప్పటిలోగా ప్రాణాలు గాలిలో కలిసేపోయేవి. ఇక్కడ పేరుకు మాత్రమే వంద పడకల దవాఖాన, వైద్య సేవలు మాత్రం కేవలం ప్రాథమిక చికిత్సలకే పరిమితం. దీంతో కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి నడిగడ్డ వంటి వెనుకబడ్డ ప్రాంతాలు అభివృద్ధి చెందడానికి అడుగులు వేశారు. ఈ ప్రాంతం పూర్తిగా వెనుకబడి ఉండడంతో విద్య, వైద్యపరంగా ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో కేసీఆర్ ప్రభుత్వం జోగుళాంబ గద్వాల జిల్లాకు నర్సింగ్ కళాశాల మంజూరు చేసింది. దీనికితోడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వంద పడకల దవాఖానను 300 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేశారు. అంతటితో ఆగకుండా ఈ ప్రాంత ప్రజలకు వైద్యవిద్యను అందించాలనే సదుద్దేశంతో జిల్లాకు మెడికల్ కళాశాలను సైతం మంజూరు చేశారు. ముందు చూపుతో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ఆ ఫలాలు త్వరలో నడిగడ్డ ప్రజలు ఆస్వాదించబోతున్నారు.

నర్సింగ్ కళాశాల ఏర్పాటుతో..

జోగుళాంబ గద్వాల జిల్లా వెనుకబడి ఉండడంతో విద్య, వైద్య రంగంలో ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్వాలకు నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలని కోరగా 2021లో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో మూడో సంవత్సరం తరగతులు నడుస్తున్నాయి. ఈ కళాశాలకు సొంత భవనం నిర్మాణం కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించగా ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. దీన్ని ఫిబ్రవరి లేదా మార్చిలో ప్రారంభించడానికి ఇక్కడి అధికారులతో పాటు ఎమ్మెల్యే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సొంత భవనం సమకూరినట్లు అవుతుంది.

రూ.49కోట్లతో 300 పడకల దవాఖాన..

రోజురోజుకూ జనాభా పెరగడంతో జిల్లా కేంద్రంలో ఉన్న వంద పడకల దవాఖాన రోగులకు ఇబ్బందిగా మారుతుండంతో ఇది గ్రహించిన కేసీఆర్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న బెడ్స్‌కు అదనంగా రెండు వందల పడకలకు పెంచుతూ అప్‌గ్రేడ్ చేసింది. రోగులకు సకల సౌకర్యాలు అందించాలనే లక్ష్యం వారికి ఆధునిక వైద్యం అందించాలనే ఆలోచనతో నూతనంగా 300 పడకల నిర్మాణాన్ని రూ.49కోట్లతో చేపట్టారు. వచ్చేనెలలో అది అందుబాటులోకి రానున్నది. దీంతో అక్కడ కార్పొరేట్ స్థాయిలో రోగులకు వైద్యం అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అది అందుబాటులోకి వస్తే ఎవరైనా ప్రమాదం జరిగి దవాఖానకు వస్తే ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఇక్కడే అన్ని రకాల వైద్య సేవలందించే అవకాశం ఉంటుంది.

300 పడకల దవాఖాన లోపలి భాగం

మెడికల్ కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు..

కేసీఆర్ ప్రభుత్వం జోగుళాంబ గద్వాల జిల్లాకు 16 సెప్టెంబర్ 2023న మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. కళాశాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం రూ.183 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది మెడికల్ కళాశాలను 100 సీట్లతో ప్రస్తుతం నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాలలో ప్రారంభించడానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌తోపాటు సిబ్బందిని కేటాయించాలని గద్వాల ఎమ్మెల్యే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కు వినతిపత్రం ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను కేటాయించింది. దీంతో వైద్యపరంగా రోగులు, ప్రజలకు ఆధునిక వైద్యం అందించేందుకు అవకాశం ఏర్పడింది. త్వరలో వీటన్నింటినీ ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ముందు చూపుతో నర్సింగ్, మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వస్తుండడంతో నడిగడ్డ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్నఢిల్లీ యూజీసీసెక్రటరీమ నీశ్ ఆర్‌జోషి

వజ్రోత్సవం అదిరెన్

- పాలెంలో అట్టహాసంగా ప్రారంభం
- దానకర్ణుడు సుబ్బయ్య : ఢిల్లీ యూజీసీ కార్యదర్శిమ నీశ్ఆ ర్‌జోషి
- 1963 నుంచి 2023 వరకు పూర్వ విద్యార్థుల హాజరు

బిజినేపల్లి, జనవరి 28 : పాలెం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసి విద్యా వ్యవస్థను పటిష్టం చేసిన మహాదానకర్ణుడు కీర్తిశేషులు సుబ్బయ్య (సుబ్రహ్మణ్య శర్మ) అని ఢిల్లీ యూజీసీ ఆర్‌జోషి అన్నారు. ఆదివారం మండలంలోని పాలెం శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 1963-2023 వరకు పాలెంలోని వివిధ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా వజ్రోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలెం గ్రామం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆనాడే గ్రామంలో అన్ని రకాల ఇనిస్టిట్యూట్లను ఏర్పాటు చేసి విద్యను పంచి న మహోన్నత వ్యక్తి సుబ్బయ్య అని అన్నారు. విద్యార్థి దశ నుంచే ఉజ్వల భవిష్యత్తు ప్రారంభమవుతుందన్నారు. రానున్న రోజుల్లో పాలెం విద్యాలయం విశ్వ విద్యాలయంగా ఏర్పడబోతుందన్నారు. ఆనాడే ప్రాంతీ య వ్యవసాయ పరిశోధన కేంద్రం, ప్రభుత్వ దవాఖాన, పాఠశాల, డిగ్రీ కళాశాల, ఆలయం, హాస్టల్ వంటి సేవలను ఏర్పాటు చేయడం సుబ్బయ్య గొప్పమ నస్సుకు నిదర్శనమన్నారు.

మెరుగైన విద్యను అందించిన వ్యక్తి సుబ్బయ్య

గ్రామీణ ప్రాంత పేదలకు మెరుగైన విద్య అందించిన వ్యక్తి సుబ్బయ్య అని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. ఇక్కడ ఎన్నో విద్యా సంస్థలు ఉన్నాయని, సుబ్బయ్య సామాజిక సేవా పరిశ్రమలు గ్రామాభివృద్ధికి ఎంతో తోడ్పాటును అందించాయన్నారు. త్వరలోనే ఈ కళాశాలలో రెండు నూతనంగా పీజీ కోర్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

రామసీతమ్మ లేనిదే మా కుటుంబం లేదు : సుబ్బయ్య కూతురు సుచిత్ర

'మా అమ్మ రామసీతమ్మ లేనిదే మా కుటుంబం లేదని, నాన్న సుబ్బయ్య చేసిన కృషి వెనుక ఆమె శ్రమ ఎంతో ఉంది' సుబ్బయ్య కూతురు సుచిత్ర అన్నారు. ప్రతి సమావేశంలో సుబ్బ య్యే తెలుసునని, తమ తల్లిని గుర్తించలేదన్నారు. తన తండ్రి ప్రతి నిత్యం ప్రజల కోసం పనిచేసేవాడన్నారు. ఇక్కడ యూజీసీని ప్రారంభిస్తే మంచిదని సభాముఖంగా తెలియజేశారు.

సుబ్బయ్య ఆశయ సాధనకు కృషి : ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

పాలెం గ్రామ నిర్మాత అయిన పాలెం సుబ్బయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. ఆయన గ్రామానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం ఆనాటి గురువులను పూలమాల, శాలువాలతో విద్యార్థులు సన్మానించారు. 60 బ్యాచ్‌లకు సంబంధించిన విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకోవడంతో కళాశాలలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు పూర్వ విద్యార్థులను అలరింపజేశాయి. కార్యక్రమంలో జేడీ రాజేంద్రసింగ్, నాగర్‌కర్నూల్ ఇంటర్‌బోర్డు నోడల్ అధికారి వెంకటరమణ, ఏవీఎన్ రెడ్డి, రంగాచార్యులు, డాక్టర్ గోపాల్, మల్లారెడ్డి, విద్యారాణి, ఆనంద్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ లావణ్య, శ్రీనివాసులు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బుడ్డయ్య, మోహన్‌బాబు, బాలకిష్టయ్య, మల్లికార్జున్, లక్ష్మీకాంత్, సురేందర్, గోపాలస్వామి పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకుహా జరైనపూ ర్వ విద్యార్థులు

పల్లెలు బాగుంటేనే దేశం అభివృద్ధి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగు నీరందించేందుకు చర్యలు : ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అయిజ, జనవరి 28 : పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు.. పల్లెలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం రూ.40 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన కొత్తపల్లి, బైనపల్లి పంచాయతీ భవనాలను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి సొంత భవనం ఉండాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం సొంత భవనాలను మంజూరు చేసిందన్నారు. అయిజ మండలంలో 8 గ్రామ పంచాయతీలకు రూ.1.60 కోట్లు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు విడుదలైనట్లు వెల్లడించారు. వాటినన్నింటినీ పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ చల్లా మాట్లాడుతూ ఆర్డీఎస్ ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ ద్వారా లింక్ కెనాల్ ఏర్పాటు చేసి ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు సాగునీరు విడుదల చేసేలా చూస్తామన్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు పారేలా చర్యలు చేపడుతామన్నారు. కొత్తపల్లిలో సీసీ, బీటీ రోడ్లు వేయించేందుకు ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వంతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంట్ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వం ఏర్పడి కొద్దికాలమే అయ్యిందని, కొంత సమయమిచ్చి సమస్యలపై పోరాటం చేద్దామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సత్యమ్మ, సరస్వతి, మున్సిపల్ చైర్మన్ దేవన్న, సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు రంగారెడ్డి, రాముడు, నర్సింహారెడ్డి, త్రివిక్రమ్‌రెడ్డి, రవిరెడ్డి, ప్రహ్లాదరెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, చిన్న హన్మంతు, చాంద్‌పాషా, పల్లయ్య, గోవర్ధన్, కిశోర్, ముక్తర్‌పాషా, రామలింగన్న పాల్గొన్నారు.



అయిజ మండలం కొత్తపల్లిలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రగతి..

వడ్డేపల్లి, జనవరి 28 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు ప్రగతి సాధించాయని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా అన్నారు. మండలంలోని నూతన గ్రామ పంచాయతీ భవనాలను జిల్లెడదిన్నె సర్పంచ్ శారద, తిమ్మాజిపల్లె సర్పంచ్ మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, పాఠశాలలు, రోడ్లు, రైతువేదికలు, వైకుంఠధామాలు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితమ్మ, జెడ్పీటీసీ రాజు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, ఉపసర్పంచ్ ఆంజనేయులు, నాయకులు శ్రీనివాసులు, సుదర్శన్, స్వాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, వినోద్ బాబు, వెంకట్రామిరెడ్డి, ఈరన్న, కాశీం పాల్గొన్నారు.

ప్రహరీ ప్రారంభం..

అయిజ రూరల్, జనవరి 28 : మండలంలోని బింగి దొడ్డి గ్రామంలో నిర్మించిన పాఠశాల ప్రహరీని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా ప్రారంభించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదనే ప్రహరీ నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, సింగిల్‌విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ రాముడు, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, తిప్పన్న, రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 28 : భద్రాద్రి కొత్తగూడెంలో ఫిబ్రవరి 10వ తేదీన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొనే జిల్లా అండర్-10, 12, 14 బాల, బాలికల జట్ల ఎంపికలను ఆదివారం స్థానిక క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి పతకాలు సాధించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్ కుమార్, కోచ్ సునీల్, పీఈటీలు శ్రీనివాస్, రాజు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం

జీవన విధానంలో మార్పు రావాలి

- తృణధాన్యాలు తింటేనే ఆరోగ్యం
- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

తృణధాన్యాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కలెంనగర్ ఎస్పీ సుంకరి శ్రీనివాస్

గద్వాల, జనవరి 28 : జీవన విధానంలో మార్పు రావాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో తృణధాన్యాలు తీసుకోవడం వల్ల ప్రజలకు కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ ఏదో ఒకటి తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఆహారం విషయంలో నియమ నిబంధనలు పాటించపోవడంతోనే గుండెపోటు వస్తుందన్నారు. మన పెద్దలు చిరు, తృణధాన్యాలు తీసుకోవడం వల్లే ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ వాటిని ఆహారంగా తీసుకొని బలిష్టంగా ఉండాలన్నారు. అనంతరం కరీంనగర్ ఎస్పీ సుంకరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం ఫాస్ట్‌ఫుడ్‌లకు ఆకర్షితులై చిన్న వయస్సులోనే గుండెపోటుకు గురి కావడం, బీపీ, షుగర్ వంటి జబ్బుల బారిన పడుతున్నారన్నారు. అందుకే ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకొని రోగాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎస్పీతో పాటు ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ వెంకటేశ్వరరెడ్డి, హైకోర్టు న్యాయవాది దేవికారెడ్డి, నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, న్యాయవాది వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంధుల జీవితం.. నేటి సమాజానికి ఆదర్శం

అంధుల జీవితం నేటి సమాజానికి ఆదర్శమని, ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు చిన్న చిన్న సమస్యలను తలకుమించిన భారంగా భావిస్తూ వాటిని ఎదుర్కొనలేక ఎంతో మంది యువత తనువు చాలిస్తున్నారని, అలాంటి వారు అంధుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంధుల పాఠశాల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, నరహరిగౌడ్, కార్యక్రమ ఆర్గనైజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్ ఫలితాల్లో ప్రతిభ

- ఊట్కూర్ నుంచి ఏడుగురు ఎంపిక

ఊట్కూర్, జనవరి 28 : ప్రభుత్వం విడుదల చేసిన స్టాఫ్ నర్స్ ఉద్యోగ జాబితాలో మండల కేంద్రమైన ఊట్కూర్‌కు చెందిన ఏడుగురు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన భవిత, దివ్య, జ్యోతి, మహేశ్వరి, గరిడి చంద్రకళ, మొట్కూర్ కిరణ్‌కుమార్, కవిత స్టాఫ్ నర్స్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. వీరంతా నిరుపేద, వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారే కావడం గమనార్హం. ఉద్యోగాలు సాధించిన వారిని ఆదివారం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

అక్కాచెల్లెళ్లకు ఉద్యోగాలు

ధన్వాడ, జనవరి 28 : ఇంట్లో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం రావడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో అక్కాచెల్లెళ్లు ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఔరా అనిపించారు. తెలంగాణ ప్రభుత్వం గతంలో నిర్వహించిన స్టాఫ్ నర్సు పరీక్ష ఫలితాలు ఆదివారం వెలువడగా.. ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఈ ఘనత సాధించారు. గున్ముక్లకు చెందిన నీరిటి జయమ్మ కూతుళ్లు నాగజ్యోతి, చంద్రకళ స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు సాధించారు. అయితే జయమ్మ చిన్న కూతురు కూడా పోలీస్ ఉద్యోగానికి అర్హత సాధించగా కుమారుడు కూడా రెవెన్యూశాఖలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. దీంతో జయమ్మ కుటుంబంలో అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయి.